విశ్వవిద్యాలయ అభివృద్ధే ధ్యేయం

- విద్యార్థులకు ప్లేస్మెంట్ అవకాశాలు
- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు
- రాయలసీమ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ సుధీర్ ప్రేమ్ కుమార్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

కర్నూలు లాంటి వెనుకబడిన ప్రాంతంలో ఉన్న రాయలసీమ యూనివర్సిటీని అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని వైస్ ఛాన్సలర్ సుధీర్ ప్రేమ్ కుమార్ ప్రకటించారు. వర్సిటీలో చదివే విద్యార్థులకు తప్పనిసరిగా ప్లేస్మెంట్ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉద్యోగులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి త్వరలో కొలిక్కి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రజాశక్తితో ముఖాముఖిలో ఆయన పలు విషయాలను పంచుకున్నారు..

వెనుకబడిన ప్రాంతమైన కర్నూలు జిల్లాలో విద్యార్థి సంఘాలు పోరాటం చేసి రాయలసీమ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. ఇప్పటి వరకు ఈ విశ్వవిద్యాలయం అభివృద్ధికి మాత్రం నామమాత్రంగానే చర్యలు తీసుకున్నారు. దీనిపై మీ స్పందన..?

విసి : రాయలసీమ విశ్వవిద్యాలయం వెనుకబడిన ప్రాంతంలో ఏర్పాటు చేయడం పట్ల ఉన్నత విద్యారంగా అభివృద్ధికి ఎంతో దోహదపడుతుంది. గతంలో అభివృద్ధి పనులను చేపట్టారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రణాళికను రూపొందించుకుంటున్నాం. ఈ విశ్వవిద్యాలయం అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

విశ్వవిద్యాలయంలో సమస్యలను ఎలా పరిష్కరిస్తారు?

విసి : విశ్వవిద్యాలయంలో నెలకొన్న కొన్ని సమస్యలను గుర్తించడం జరిగింది. ప్రధానంగా తాగునీటి సమస్య పరిష్కరించేందుకు దృష్టి సారించాం. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ఎన్జీవో సంఘాల సహకారంతో ప్రత్యేకంగా బోర్లను ఏర్పాటు చేయడమే కాకుండా ఆర్డబ్ల్యూఎస్ ద్వారా పైప్ లైన్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేశాం. అలాగే హాస్టళ్లో ఉన్న సమస్యలను కూడా పరిష్కరించేందుకు దృష్టి పెట్టాము. ఇంకా మిగిలిన కొన్ని సమస్యలను గుర్తించాం వాటిని కూడా త్వరలోనే పరిష్కారానికి అడుగులు వేస్తాం.

విశ్వవిద్యాలయంలో పీజీ లాంటి కోర్సులను పూర్తి చేసిన తర్వాత విద్యార్థులు పూర్తిస్థాయిలో ఉపాధి అవకాశాలను పొందలేకపోతున్నారు?

విసి : విశ్వవిద్యాలయంలో పూర్తి చేసిన విద్యార్థి వెంటనే బయటికి వెళ్ళగానే ఉపాధి అవకాశం పొందాలి. అలాంటి పరిస్థితి ఇక్కడ కనిపించడం లేదు. అందుకే కొంత మంది నిష్ణాతులైన గెస్ట్ ఫ్యాకల్టీని ఇక్కడికి రప్పించి విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించడం జరుగుతుంది. అలాగే విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న అధ్యాపకులను విదేశీ విశ్వవిద్యాలయానికి పంపించి అక్కడ ఉన్నత

విద్యాపరంగా జరుగుతున్న బోధన, ఉపాధి అవకాశాల కల్పనపై అధ్యయనం చేయించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుంది.

మినిమం టైం స్కేల్ కింద పనిచేసే ఉద్యోగులకు సరైన వేతనాలు అందడం లేదు ? ఉద్యోగ నియామకాలు కూడా పారదర్శకంగా చేపట్టడం లేదని ఆరోపణలు ఉన్నాయి? వీటిపై మీ స్పందన ఏమిటి ?

విసి : ఉద్యోగ నియామకాలను గత వైస్ ఛాన్సలర్లు పాలకమండలిలో ఆమోదముద్ర వేసిన తర్వాతనే అనేక మందిని ఉద్యోగంలోకి తీసుకోవడం జరిగింది. పారదర్శకంగా కొంతమంది నియామకాలు చేయలేదని తొలగించారు. త్వరలోనే పాలకమండలిలో ఈ విషయాలన్నిటిని చర్చించడమే కాకుండా వారికి తప్పనిసరిగా న్యాయం చేస్తాం. మినిమం టైం స్కేల్ మరియు కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా వేతనాలు చెల్లింపులో అనేక సమస్యలు ఉన్నాయి. సమస్యలపై రాష్ట్ర ఉన్నత విద్యా మండలి దృష్టికి తీసుకువెళ్లి టెక్నికల్‌గా ఉన్న వాటిని గుర్తించి పరిష్కరించాలని చర్యలు తీసుకుంటున్నాం. వెంటనే సకాలంలో వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటాం.

విశ్వవిద్యాలయంలో అనేక అవినీతి అక్రమాలు పూర్తి చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

విసి : విశ్వవిద్యాలయంలో జరిగిన విషయాలన్నీపై ఇప్పుడే అవగాహన చేసుకుంటున్నాను. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి ఉంటే చర్యలు తీసుకోవడమే కాకుండా అక్కడ ఉన్న లోపాలను సరి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

కొన్ని డిపార్ట్మెంట్ కోర్సుల్లో విద్యార్థులు లేక మూసేసిన పరిస్థితులు ఉన్నాయి? ఏమైనా కొత్త కోర్సులను ప్రవేశపెడతారా?

విసి : విశ్వవిద్యాలయంలో రాబోయే రోజుల్లో అన్ని డిపార్ట్మెంట్లో ఉన్న కోర్సుల్లో సీట్లన్నీ భర్తీ అయ్యేలా చర్యలు తీసుకుంటాం. వీటితో పాటు కొత్త కోర్సులను కూడా ప్రవేశపెట్టేందుకు అడుగులు వేస్తున్నాం.

నేటి నుండి 'పది' పరీక్షలు

- 37,801మంది విద్యార్థులకు 162 కేంద్రాలు
- ఏర్పాట్లన్నీ పూర్తి : డిఇఒ కె.శామ్యూల్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో సోమవారం నుండి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ వెల్లడించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మొత్తం 489 పాఠశాలలకు చెందిన 31,070 మంది విద్యార్థులు, 6020 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని చెప్పారు. ఈ పరీక్షల నిర్వహణకు దాదాపుగా 162 పరీక్షా కేంద్రాలను గుర్తించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ ఇటీవలనే అన్ని శాఖలకు చెందిన అధికారులతో సమీక్షించారని తెలిపారు. 44 జోన్లను కూడా ఏర్పాటు చేశామన్నారు. 162 మంది చీఫ్ సూపరిం డెంటెంట్లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు 11 మందిని కస్టోడియన్ గుర్తించామని, 1553 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. టెన్త్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా పక్కాగా స్క్వాడ్లను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 8 పరీక్షా కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామని, వీటిలో సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్కు పాల్పడకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏవైనా పొరపాట్లు జరుగుతే సంబంధిత నిర్వహణ అధికారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని పేర్కొన్నారు. అలాగే ఓపెన్ స్కూల్ పరీక్షలు సోమవారం నుండే ప్రారంభం అవుతున్నాయని పేర్కొన్నారు. ఈ పరీక్షలు 21 కేంద్రాల్లో దాదాపు 3223 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. సమావేశంలో పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ చంద్ర భూషణ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇఒ కె.శామ్యూల్

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - క్రిష్ణగిరి

అప్పుల బాధతో రైతు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలం లాలుమాన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. లాలుమాన్‌పల్లి గ్రామానికి చెందిన రైతు షేక్ అల్లా బకాష్ (38) సొంత పొలం 3 ఎకరాలు, కౌలుకు 4 ఎకరాలు తీసుకుని పంటలు సాగు చేస్తూ జీవిస్తున్నాడు. గత సంవత్సరంలో సొంత పొలం రెండెకరాలలో ఉల్లి పంట సాగు చేశాడు. దిగుబడి ఆశించినంత వచ్చినా ధర లేకపోవడంతో దాదాపు రూ. 6 లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఈ సంవత్సరం 7 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశాడు. అయితే ఈ ఏడాది వర్షాభావం వల్ల మిర్చి పంట దిగుబడి తగ్గిపోవడం, గిట్టుబాటు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయాడు. పంట సాగు కోసం చేసిన అప్పులు రూ. 11 లక్షలకు చేరుకున్నాయి. పంట దిగుబడి సరిగా లేకపోవడం, అప్పులు ఇచ్చిన వారు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేయడంతో అల్లా బకాష్ మనస్థాపానికి గురయ్యాడు. షేక్ అల్లా బకాష్ శనివారం సాయంత్రం పొలంలో మామిడి చెట్లకు స్ప్రే మందు చేసి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉన్న అల్లా బకాష్‌ను వెంటనే డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అల్లా బకాష్ చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం ఉదయం మృతి చెందాడు. రైతు అల్లా బకాష్‌కు భార్య షేక్.హలీమా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఫిర్యాదు మేరకు క్రిష్ణగిరి ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రశాంతంగా 'గ్రూప్-1'

- పర్యవేక్షించిన జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలు ఆదివారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 31 పరీక్ష కేంద్రాల్లో గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించారు. సుంకేసుల రోడ్డు సెయింట్ జోసెఫ్ కాలేజీ, ఏ క్యాంప్ మాంటిస్సోరి స్కూల్ పరీక్షా కేంద్రాలను జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు గ్రూప్-1 పరీక్షలు పేపర్-1, మధ్యాహ్నం 2 నుండి 4 వరకు పేపర్-2 నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో 31 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-1 పరీక్షలు నిర్వహించామన్నారు. ఉదయం జరిగిన గ్రూప్-1 పరీక్షలు పేపర్-1కు 11384 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 7340 మంది విద్యార్థులు హాజరయ్యారని అన్నారు. మధ్యాహ్నం 2 నుండి 4 వరకు జరిగిన పేపర్-2 పరీక్షకు 11384 మంది విద్యార్థులకు గాను 7286 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. పేపర్-1 పరీక్షకు 64.48 శాతం, పేపర్-2 పరీక్షకు 64.శాతం విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతంగా, ప్రశాంతంగా పరీక్షలు ముగిశాయని పేర్కొన్నారు.

మతోన్మాద బిజెపితో అంటకాగుతున్న

వైసిపి, టిడిపిలను ఓడించండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మతోన్మాద బిజెపితో అంటకాగుతున్న వైసిపి, టిడిపిలని ఓడించాలని, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల పేర్కొన్నారు. 48వ వార్డు అమీర్ హైదర్ ఖాన్ నగర్‌లో సిపిఎం పార్టీ ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మత ఉన్మాద చర్యలకు పాల్పడుతున్నారని, అందుకు నిదర్శనం సిఎఎను అమలు చేయడమేనని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉండే బిజెపి ఇచ్చిన హామీలు గాలికి వదిలి దేశాన్ని అప్పుల్లో ముంచి వేశారన్నారు. జగన్మోహన్ రెడ్డిని, చంద్రబాబు నాయుడును తమ చెప్పు చేతుల్లో పెట్టుకున్న నరేంద్ర మోడీ వారిపై బెదిరింపులకు పాల్పడి కేసులను బయటికి తీసి ఇద్దరి తాటాతీస్తానని బెదిరించి రాజ్యమేలుతున్నాడని విమర్శించారు. చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడం కోసం రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టి ప్రత్యేక హెూదా గురించి గానీ ప్రత్యేక ప్యాకేజీ గురించి గానీ, రైల్వే జోన్ గురించి గానీ పార్లమెంటులో మాట్లాడిన దాఖలాలు లేకుండా పోయాయని అన్నారు. సిపిఎం నగర కమిటీ సభ్యులు మహబూబ్ పాల్గొన్నారు.

నగరాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలు

42వ వార్డు చల్లావారి వీధిలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప అధ్యక్షతన పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరుల సమావేశం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు, సిపిఎం జిల్లా నాయకులు సి.గురుశేఖర్, మాజీ కార్పొరేటర్ చలపతి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా కర్నూలు నగరం ఎటువంటి అభివృద్ధి లేక వెనుకబడిందని కర్నూలు నగరాన్ని నీళ్ల సమస్య, డ్రైనేజీ, ట్రాఫిక్ సమస్యలు పట్టిపీడిస్తున్నాయని ప్రజా సమస్యలు పట్టించుకునే నాయకుడు కరువయ్యారని తెలిపారు. గతంలో గఫూర్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తాగునీటి సమస్యతో అల్లాడుతున్న కర్నూల్ నగరానికి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించి కర్నూలు నగర ప్రజల దాహార్తిని తీర్చారని, నగరంలో ఎంతోమంది పేదలకు ఇళ్ల స్థలాలు,పట్టాలు ఇప్పించి పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చారని, రోడ్డులు, డ్రైనేజీలు నిర్మించి నగరాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టించారని తెలిపారు. కార్యక్రమంలో వార్డు మహిళా నాయకురాలు కిరణ్మయి, జయంతి, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్, షంషీర్, వార్డు శాఖ కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

ఐదో వార్డు చిత్తారి వీధిలో వర్మ స్కూల్‌లో, పెద్దపడాకన దండిగేరిలో వార్డు విస్తృత సమావేశాలు నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, సిపిఎం నాయకులు ఎం నాగరాజు మాట్లాడుతూ ప్రజల సమస్యలను పక్కనపెట్టి బిజెపి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని, వైసిపి, టిడిపి రెండూ బిజెపికి అనుకూలంగా ఉన్నాయని, దేశంలో రాష్ట్రంలో ఈరోజు మతోన్మాదం పెరిగిపోతుందని, ఈ రెండు పార్టీల్లో ఎవరికి ఓటు వేసిన అవి బిజెపికి వేసినట్లేని తెలిపారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

ఎన్నికల కోడ్ అవగాహనపై పోలీసుల కవాతు

ప్రజాశక్తి - సి.బెళగల్

ఎన్నికల సందర్భంగా కోడ్ అవగాహన కోసం ఎస్సై తిమ్మారెడ్డి పోలీసు బెటాలియం సమక్షంలో ఆదివారం సి.బెళగల్ మండలంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు ఘర్షణలు పెట్టుకోరాదని అన్నారు. అలాగే ఫ్లెక్సీలు, అనవసర ప్రచారాలు తగదని హెచ్చరించారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి - కర్నూలు హాస్పటల్

కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామానికి చెందిన క్రిష్ణవేణికి సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరయిన రూ. 4 లక్షలు చెక్కును పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆదివారం కల్లూరులోని ఎమ్మెల్యే స్వగృహంలోని కార్యాలయంలో బాధితురాలికి అందజేశారు. బాధితురాలు క్రిష్ణవేణి భర్త కురువ సుంకన్న లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స కోసం హైదరాబాద్‌లో దాదాపు రూ. 15 లక్షల వరకూ ఖర్చు పెట్టి చూపించినా కోలుకోలేక గతేడాది మృతి చెందాడు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయిన క్రిష్ణవేణి కుటుంబాన్ని ఆదుకోవాలని వైసిపి గ్రామ నాయకులు పాణ్యం ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని సిఎం దృష్టికి తీసుకెళ్లి సిఎం రిలీఫ్ ఫండ్ కింద రూ. 4 లక్షలు మంజూరు చేయించి బాధితురాలికి అందజేశారు. సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కుటుంబాన్ని ఆదుకోవడంతో వైసిపి గ్రామ నాయకులు, కార్యకర్తలు, బాధిత కుటుంబ సభ్యులు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి కల్లూరు మండల కన్వీనర్ పెద్ద ఈశ్వరయ్య, నాయకులు కురుకుంద నారాయణ, వంశీరెడ్డి, చిన్న టేకూరు సర్పంచి లక్ష్మన్న, ఉప సర్పంచి శ్రీరాములు, ఎంపిటిసి సామన్న, కురువ చంద్రశేఖర్, వార్డు మెంబర్ రాజు తదితరులు పాల్గొన్నారు.


సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

ఒపిఎస్ అమలు చేసే పార్టీలకే మద్దతు : యుటిఎఫ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే పార్టీలకే రాబోయే ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కార్మిక కర్షక భవన్లో యుటిఎఫ్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు యుఆర్ ఏ.రవికుమార్ అధ్యక్షత వహించారు. సమావేశంలో కె.సురేష్ కుమార్‌తో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నవీన్ పాటి పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగులకు ఉపాధ్యాయులకు ఓపిఎస్ అమలు పరచడం పట్ల వైసిపి, టిడిపి మద్దతు ఇవ్వడం లేదన్నారు. అందుకే ఓట్ ఫర్ ఓపిఎస్ నినాదంతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు జి.హేమంత్ కుమార్, జీవిత, జిల్లా ఆర్థిక కార్యదర్శి యెహెూషువ, జిల్లా గౌరవాధ్యక్షుడు దావీదు, ఆడిట్ కమిటీ జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు జిల్లా కార్యదర్శిలు తిమ్మన్న, వెంకటేష్, లక్ష్మీ దేవి, నరసింహ, దేవపాల్, గాదలింగ, భాస్కర్, రాష్ట్ర కౌన్సిలర్లు జయరాజు, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్

పిల్లలకు కరాటే శిక్షణ తప్పనిసరి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

పిల్లలకు కరాటే శిక్షణ తప్పనిసరిగా ఇప్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని జొహరాపురంలో షడ్రక్ నగర్‌లో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, యూనివర్సల్ బూడోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర నాయకులు విజయ్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్‌తో పాటు అసోసియేషన్ ఫౌండర్, డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొని మాట్లాడారు. బాల్య దశలోనే ఆరోగ్యవంతమైన శరీరాన్ని తయారు చేసుకునేందుకు ఇలాంటి కరాటే శిక్షణలను తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. కరాటే ద్వారా శారీరక ధృఢత్వం కూడా ఏర్పడుతుందని పేర్కొన్నారు. పాఠశాలల్లో కేవలం విద్యార్థులకు బోధన మాత్రమే చేయకుండా క్రీడలు కూడా నిర్వహించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. క్రీడల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులను కేటాయించి పాఠశాలల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రేడ్ బెల్టులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రంగస్వామి, నాగరాజు, ఖలీల్, కరాటే శిక్షణకులు సుధాకర్, శ్రీనివాసులు, నాగన్న, మౌలాలి, బహదూర్, మద్దిలేటి, ఏ.నాగరాజు, ఎర్రమల, లక్ష్మణ్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

బెల్టులు ప్రదానం చేస్తున్న గౌస్‌దేశాయ్ తదితరులు

ఐక్య ఉద్యమాలతోనే యూనియన్ బలోపేతం

-అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

తపాలా ఉద్యోగుల సంఘం పిత్రీను బలోపేతం చేసుకోవాల్సిన అవసరమైన ఎంతైనా ఉందని, అందుకు ఐక్య ఉద్యమాలే శరణ్యమని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం పిత్రీ రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్ బాబు అన్నారు. ఆదివారం స్థానిక తంతి తపాలా ప్రధాన కార్యాలయంలో కర్నూలు డివిజన్ సమావేశం జరిగింది. రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా కర్నూల్ డివిజన్‌కు వచ్చిన సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ దేశంలో తపాల శాఖ ఉనికి భవిష్యత్తులో రాబోవు పరిస్థితులు, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ పిత్రీ గుర్తింపు రద్దయి దాదాపు సంవత్సరమైందన్నారు. తపాలా శాఖ ప్రైవేటీకరణకు ఎన్ఎఫ్‌టిఈపి 3 అడ్డుగా ఉందనే ఒకే ఒక్క కారణం చేత సరైన ఆధారాలు లేకున్నా గుర్తింపు రద్దు అనేది దేశంలో మోడీ ప్రభుత్వం నిరంకుశ పాలనకు నిదర్శనమని తెలిపారు. సమావేశంలో సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గాలు చర్చించారు. కావున రాబోవు కాలంలో యూనియన్ను బలోపేతం చేసుకున్నప్పుడే డిపార్ట్మెంట్, ఉద్యోగుల సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో నాయకులు గిరిబాబు, ఈశ్వరయ్య, మహమ్మద్ జానీ, శమంతక రెడ్డి, గరీబి, చైతన్య, గంగాధర్, మహిళా ఉద్యోగులు మాధవి, గాయత్రి, కృష్ణవేణి, స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీధర్ బాబు

స్పందన కార్యక్రమం రద్దు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఎన్నికల షెడ్యూల్ విడుదలయినందున స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో, డివిజన్, మున్సిపాలిటీ, మండల స్థాయిలలో కూడా స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవు : సిఐ

ప్రజాశక్తి - పత్తికొండ

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని,పత్తికొండ మండలం గ్రామీణ ప్రాంతంలోని రాజకీయ నాయకులు, అల్లరి ముకలు ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని పత్తికొండ అర్బన్ సీఐ మురళీమోహన్ హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నగారా మోగినందు వల్ల ప్రజలు ఎక్కడా గుమ్మికూడదన్నారు. అల్లర్లు సృష్టించరాదని, వ్యక్తిగత దూషణలు చేసుకోరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

టిడిపి గెలుపునకు కష్టపడాలి

- కర్నూలు అభ్యర్థి టిజి భరత్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించేందుకు జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కష్టపడాలని కర్నూలు నియోజకవర్గ అభ్యర్థి టిజి భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని మౌర్య ఇన్‌లో తెలుగుయువత పార్లమెంట్ సెక్రటరీ మోతీలాల్ ఆధ్వర్యంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులతో టిజి భరత్ సమావేశమయ్యారు. ప్రస్తుతం ఎన్టీఆర్ సినిమాల్లో టాప్ లెవల్‌లో ఉన్నారన్నారు. ఎన్టీఆర్ దృష్టంతా ఇప్పుడు సినిమాలవైపే ఉందన్నారు. టిడిపిని వదిలేది లేదని గతంలో ఎన్టీఆర్ చెప్పినట్లు గుర్తు చేశారు. అందుకే ప్రతి ఒక్క అభిమాని టిడిపి విజయం కోసం కృషి చేయాలని కోరారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు చంద్రబాబు విజన్‌తో పని చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.


జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్‌తో టీజీ భరత్

ఇంటింటి ప్రచారం చేస్తున్న బుట్టా రేణుక

ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు

- ఎమ్మిగనూరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు : అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రజలందరికీ ఫలాలు అందించిన గొప్ప నేత సీఎం జగన్మోహన్ రెడ్డి అని ఎమ్మిగనూరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని 29వ వార్డు శివాలయం నందు స్వామి వారిని ప్రత్యేక దర్శనం చేసుకొని అనంతరం వార్డు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి వైసిపి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలు వింటూ హామీలు ఇస్తూ తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బుట్టా శివనీలకంఠ, 29వ వార్డు కౌన్సిలర్ రజిత ప్రతాప్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, ఇన్‌ఛార్జులు తదితరులు పాల్గొన్నారు.

పశువుల మార్కెట్లో సమస్యలను అడిగి తెలుసుకున్న బుట్టా రేణుక : పశువుల కోసం తాగునీటి వసతి కల్పిస్తామని వైసిపి అభ్యర్థి బుట్టా రేణుక పేర్కొన్నారు. పట్టణంలోని కర్నూలు రోడ్డులోని ఉన్న ఎద్దుల మార్కెట్ (ఆదివారం సంత)లో రైతులనును ఆమె కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంతలో పశువులకు తాగునీటి వసతి కల్పించాలని రైతులు కోరారు. ఆమె స్పందిస్తూ త్వరలోనే తాగునీటి వసతిని రైతులతో పాటు పశువులకు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు బుట్టా ప్రతూల్, ఎంపీపీ, వార్డు కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ అధ్యక్షులు, పట్టణ అధికార ప్రతినిధి, కౌన్సిలర్లు, ఇన్‌ఛార్జులు తదితరులు పాల్గొన్నారు.

ఎంసెట్ ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆదోని : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే ఎంసెట్ ఉచిత కోచింగ్‌ను విద్యార్థులు సద్వినియోం చేసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. ఆదివారం ఆదోనిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదోని మండలం, గ్రామీణ పేద విద్యార్థినీ విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 23 వరకు 33 రోజులపాటు ఆదోనిలోని విశ్వనారాయణ జూనియర్ కళాశాలలో ఎంసెట్ కోచింగ్ ఇస్తారన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 9052166745, 9515291609 నంబర్లకు సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

సెపక్‌తక్రా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆదోని : రాయలసీమ విశ్వవిద్యాలయం, ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సంయుక్తంగా నిర్వహించే ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల సెపక్ తక్రా పోటీలను ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆదివారం రాయలసీమ ఉపకులపతి ప్రొఫెసర్ బి సుధీర్ ప్రేమ్ కుమార్, మాజీ కరస్పాండెంట్ విశ్వనాథ రెడ్డిలు ప్రారంభించారు. ఒకే రోజు జరిగిన 24 పోటీల్లో శ్రీకాకుళంపై రాయలసీమ యూనివర్సిటీ, జైనారాయణ వ్యస్ విశ్వ విద్యాలయంపై కొచ్చిన్ విశ్వవిద్యాలయం, జైపూర్ నిర్వాణ విశ్వ విద్యాలయంపై యూనివర్సిటీ ఆఫ్ కాలికట్, మాధవ్ యూనివర్సిటీ పింద్వరాపై మౌలానా ఆజాద్ జోడ్‌పూర్ విజయం సాధించాయి. కళాశాల చైర్మన్ విట్ట సతీష్, వైస్ ఛైర్పర్సన్ డాక్టర్ విజయ లక్ష్మి, కరస్పాండెంట్ దైవదీనం రెడ్డి, మాజీ కరస్పాండెంట్లు శ్రీనివాస రెడ్డి, తిమ్మరెడ్డి, బసవన గౌడు, సత్య నారాయణ రెడ్డి, సనత్ కుమార్, ప్రిన్సిపాల్ మురళి మోహన్, విశ్వ విద్యాలయం నుండి శివ కిషోర్, ముత్తైయ, కళ్యాణ్ కుమార్, చంద్ర శేఖర్ ఫిజికల్ డైరెక్టర్లు, కంబీ రెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారులతో కళాశాల కరస్పాండెంట్

తిక్కారెడ్డి అండ లేకుండా టిడిపి గెలవలేదు

- రాష్ట్ర మత్స్య పరిశ్రమ అభివృద్ధి మాజీ డైరెక్టర్ బిఎస్ నవీన్ కుమార్

ప్రజాశక్తి - మంత్రాలయం

పాలకుర్తి తిక్కారెడ్డి అండ లేకుండా మంత్రాలయంలో టిడిపి గెలవలేదని, ఆయన మద్దతు కలిగిన బిసి వర్గానికి అధిష్టానం టికెట్ ఇవ్వాలని రాష్ట్ర మత్స్య పరిశ్రమ అభివృద్ధి మాజీ డైరెక్టర్ బిఎస్ నవీన్ కుమార్ స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలోని ఆయన కార్యాలయంలో తిక్కారెడ్డితో కలిసి టికెట్ విషయంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం టిడిపి మొదటి నుంచి కృషి చేస్తుందన్నారు. తిక్కారెడ్డి అధ్వర్యంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారని చెప్పారు. తిక్కారెడ్డి పార్టీని కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా ఉంటూ, వైసిపి వేధింపుల నుండి టిడిపి శ్రేణులను కాపాడుకుంటూ వచ్చిన వ్యక్తిని కాదని వైసిపి నుంచి వలస వచ్చిన వ్యక్తికి అధిష్టానం టికెట్ కేటాయించడం బాధాకరమన్నారు. టికెట్ కేటాయింపు జరిగి మూడు రోజులైనా బిసి నాయకులతో సమావేశం చేయలేని వ్యక్తి టిడిపి అభ్యర్థి అన్నారు. నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను విజయవంతం చేయడంలో తిక్కారెడ్డి కృషి చాలా ఉందని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును అక్రమ అరెస్టు చేసినప్పుడు నిరసనలో నెల రోజుల పాటు తెలుగు తమ్ముళ్లతో కలిసి నిరసనలు చేపట్టారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో బలమైన నాయకుడిని వదిలి బిసి సామాజిక వర్గం పేరుతో రాఘవేంద్ర రెడ్డికి టికెట్ ఇవ్వడం సమంజసం కాదన్నారు. అధిష్టానానికి తప్పుడు సమాచారం ఇవ్వడం వల్లే ఇలా జరుగుతోందని తెలిపారు. కుడితి సామాజిక వర్గం టికెట్ ఇవ్వాలని లేనిపక్షంలో తిక్కారెడ్డి మద్దతు ఉన్న తనకు టికెట్‌ను కేటాయించాలని, ఇది రెండవ ప్రతిపాదనగా చూడాలని అధిష్టానాన్ని కోరారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేశప్ప స్వామి, ఎంపిటిసి వెంకటేష్ జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా త్రాగునీటి సంఘం అధ్యక్షులు సిద్ధప్ప, ఆదోని తాగునీటి సంఘం అధ్యక్షులు శేషన్న, కళింగ సంఘం అధ్యక్షులు రామచంద్రారెడ్డి, నాయకులు వీరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



తిక్కారెడ్డితో రాష్ట్ర మత్స్య పరిశ్రమ అభివృద్ధి మాజీ డైరెక్టర్ బిఎస్ నవీన్ కుమార్

తనిఖీ చేస్తున్న సీఐ శ్రీనివాసులు సిబ్బంది

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం స్థానిక సీఐ శ్రీనివాసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నిబంధనల ప్రకారం వాహనాల్లో అధిక మొత్తంలో డబ్బులు తీసుకువెళ్ళరాదని, ఒకవేళ తీసుకువెళ్లినప్పటికీ అందుకు సంబంధించిన బిల్లులు తప్పనిసరిగా ఉండాలన్నారు, అలాగే బంగారం, వెండిని కూడా తీసుకువెళ్లి నట్లయితే అందుకు సంబంధించిన దుకాణం బిల్లులు ఉండాలన్నారు. గ్రామాల్లో ఎన్నికల ప్రచార సమయాల్లో అన్ని పార్టీల వారు సమన్వయంగా, ప్రశాంతంగా నిర్వహించు కోవాలన్నారు. గ్రామాల్లో అల్లర్లు, ఘర్షణలకు ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేకంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బివిజె గెలుపునకు కృషి : టిడిపి

ప్రజాశక్తి - నందవరం

ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా బివి జయ నాగేశ్వర రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించి, మంత్రిని చేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త నిరంతరం కషి చేస్తారని టిడిపి సీనియర్ నాయకులు పెద్దకొత్తిరి గొల్ల సోమన్న అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నందవరం మండలం అభివృద్ధి జరిగిందంటే కేవలం దివంగత మాజీ మంత్రి మోహన్ రెడ్డి కుటుంబం వల్లనే అన్నారు. గతంలో ఎమ్మెల్యే ఉన్న సమయంలో పెద్ద కొత్తిలి పంచాయతీకి రూ. లక్షలు కేటాయించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత బివిజేది అన్నారు. అలాంటి వ్యక్తిని మరోసారి గెలిపించుకుంటే మండలంతో పాటు గ్రామాలు కూడా అభివృద్ధి పథంలో నడుస్తాయన్నారు. పెద్దకొత్తిలి పంచాయతీ పరిధిలోని ప్రతి గ్రామం నుండి మెజార్టీ తెప్పించేందుకు కృషి చేస్తామన్నారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

- సర్వీసు రోడ్ల విస్తరణ చేపట్టాలి

- సంతోష్ నగర్, బాలాజీ నగర్ వ్యాపార, వాణిజ్య, వివిధ కాలనీలు, అపార్ట్మెంట్స్ అసోసియేషన్‌లు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని సంతోష్ నగర్, బాలాజీ నగర్‌ల వద్ద అశాస్త్రీయంగా నిర్మించిన జాతీయ రహదారి వల్ల ప్రతిరోజు విద్యార్థినీ, విద్యార్థులు, వృద్ధులు, మహిళలతో పాటు వేలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించి, సర్వీసు రోడ్ల విస్తరణ చేపట్టాలని సంతోష్ నగర్, బాలాజీ నగర్ ప్రాంతాల వ్యాపార వాణిజ్య, నివాస ప్రాంతాల అసోసియేషన్‌ల నాయకులు డిమాండ్ చేశారు. పెట్రోల్ బంకు యజమానుల సంఘం జిల్లా అధ్యక్షులు జక్కం సురేష్ అధ్యక్షతన వ్యాపార, వాణిజ్య,నివాస ప్రాంతాలు, అపార్ట్మెంట్ అసోసియేషన్ సమావేశం ఆదివారం నగరంలోని సూర్య లాడ్జిలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, అపార్ట్మెంట్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గోపీనాథ్, కృష్ణయ్య, వ్యాపార వాణిజ్య వర్గాల నుండి దుర్గా ప్రసాద్ రెడ్డి, జలీల్ అహమ్మద్‌లు పాల్గొని మాట్లాడారు. స్థానిక ప్రజల కష్ట సుఖాల గురించి కేంద్ర ప్రభుత్వ జాతీయ రహదారి అధికారులు స్పందించడం లేదన్నారు. పర్లాంగు దూరంలో ఉండే స్కూలుకు విద్యార్థులు, కిరాణా దుకాణానికి మహిళలు వెళ్లాలంటే రెండు కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తుందని, లేదా ప్రమాదానికైనా గురి కావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితి ఎక్కడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారుల సంస్థ ఇంజనీర్లు కాంట్రాక్టర్లు ఉద్దేశపూర్వకంగా అవసరం లేని కచ్చా ఫుట్ పాత్‌లు నిర్మించి, సర్వీస్ రోడ్లను చిన్నగా చేసి స్థానిక ప్రజలను ప్రమాదాలకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కేంద్ర ప్రభుత్వ జాతీయ రహదారుల సంస్థ ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుపై ట్రాఫిక్ సిగ్నల్స్‌తో పాటు ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేయాలని, సర్వీస్ రోడ్ల విస్తరణ జేసి ఫుట్ ఓవర్ బ్రిడ్జి(ఎత్తైన వంతెన) నిర్మించాలని తీర్మానించారు. కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇలాగే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే స్థానిక ప్రజలందరూ కలిసి ఆందోళనను ఉధృతం చేస్తామని, ఆందోళనకు పట్టణ పౌర సంక్షేమ సంఘం మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో విశ్వనాథ్ రెడ్డి, కృష్ణ, షేక్ హసన్ భాష, మహబూబ్ బాషా, ప్రభాకర్, సుధాకర్, వెంకట రాముడు, శ్రీనివాసులు గౌడు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికి రావాలని ఫారూక్ షిబ్లీకి మీనాక్షి నాయుడు ఆహ్వానం

ప్రజాశక్తి - ఆదోని

అసెంబ్లీ ఎన్నికల నేపథంలో ప్రచారానికి ఆదోనికి రావాలని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫారూఖ్ షిబ్లీను టీడీపీ ఆదోని ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆహ్వానించారు. ఆదివారం విజయవాడలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ముస్లిం మైనారిటీలపై చేసిన వేధింపులను వివరించామన్నారు. సమితి తరుపున వైసిపి ప్రభుత్వంపై తిరస్కార పత్రం ద్వారా చేస్తున్న పోరాటం అమోఘమని ప్రశంసించారు. ఆదోనిలోని ప్రతి మైనార్టీ ఇంటికి తిరస్కార పత్రం వెళ్ళే విధంగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఫారూఖ్ షిబ్లీ మాట్లాడుతూ కచ్చితంగా వైసీపీని గద్దె దించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఆదోని ప్రాంతంలో మతసామరస్యం కోసం ముందుకు కొనసాగాలని, మతతత్వ శక్తులను దూరంగా ఉంటేనే ఇది సాధ్యపడుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఆదోనిలో టిడిపి భారీ మెజారిటీతో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఆయనతోపాటు నాయకుడు బుద్ధారెడ్డి ఉన్నారు.

ఫారూక్ షిబ్లీతో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

టిడిపి నాయకుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - ఆదోని

మంగళగిరి ఆసుపత్రిలో కోలుకుంటున్న ఆదోని పట్టణం రెండో వార్డు మాజీ కౌన్సిలర్ తిమ్మప్పను మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆదివారం పరామర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత రెండు రోజుల క్రితం టిడిపి అధ్యక్షుడు చంద్రబాబును కలిసేందుకు మంగళగిరికి వాహనంలో ప్రయాణమయ్యారన్నారు. అక్కడికి వెళ్లిన అనంతరం అస్వస్థత గుర్తై ఆస్పత్రిలో చేరారన్నారు. పరీక్షించిన వైద్యులు గుండెకు సంబంధించిన సమస్య ఉందని తెలపడంతో స్టంట్ వేశారని తెలిపారు. ప్రస్తుతం కోలుకున్నాడని, ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. పరామర్శించిన వారిలో బుద్ధారెడ్డి, లక్ష్మి నారాయణ, వేణుగోపాల్ రెడ్డి, శేషగిరి, బత్తిని కుబేర్నాథ్ ఉన్నారు.

ఆస్పత్రిలో తిమ్మప్పను పరామర్శించిన మీనాక్షి నాయుడు

భరోసా కల్పించేందుకే పోలీసుల కవాతు : ఎస్‌పి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాలలో పోలీసులు కవాతు నిర్వహించామని జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున కేంద్ర సాయుధ బలగాలతో కలిసి జిల్లా పోలీసులు ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు, ఎటువంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా, శాంతిభద్రతలను కాపాడడానికి కేంద్ర సాయుధ బలగాల పోలీసులతో కవాతు నిర్వహించారన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికలలో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా దానికి జిల్లా పోలీసు యంత్రాంగం సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. జిల్లాలోని కర్నూలు, ఆదోని, పత్తికొండ సబ్ డివిజన్‌లలోని పలు ప్రాంతాలలో, కేంద్ర సాయిధ బలగాలైన "సశస్త్ర సీమా బల్" సిబ్బందితో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. సి.బెళగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సి .బెళగల్, పోలకల్, కంబదహాళ్(కంపాడు) గ్రామాలలో, పెదకడుబూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పెదకడుబూరు, చినకడుబూరు హనుమాపురం గ్రామాల్లో, వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని వెల్దుర్తి టౌన్, రామళ్లకోట, అల్లుగుండు, మల్లెపల్లి, బొమ్మిరెడ్డిపల్లి, చెరుకులపాడు గ్రామాలలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు.

దేవస్థానంలో చలువ పందిళ్లు

ఉరుకుంద దేవస్థానంలో చలువ పందిళ్లు

ప్రజాశక్తి - కౌతాళం : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాలలో ఒకటైన శ్రీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం ఆవరణంలో చలువ పందిళ్ల ఆదివారం ఏర్పాటు చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఈ చలువ పందిళ్లుఏర్పాటు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ హెచ్‌జి వెంకటేష్ తెలిపారు. దాతల సహకారంతో గోశాలకు ఆరు ట్రాక్టర్ల పశుగ్రాసం అందించినట్లు చెప్పారు.

నేటి నుండి పదవ తరగతి పరీక్షలు : ఎంఇఒ

ప్రజాశక్తి - తుగ్గలి : మండలంలోని తుగ్గలి జడ్పీ పాఠశాల, తుగ్గలి నోవీ పాఠశాల, జొన్నగిరి జెడ్పి పాఠశాల, పెండేకల్ జడ్పీ పాఠశాలలో సోమవారం నుండి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి రామ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం మండలంలో పదవ తరగతి పరీక్షలు జరిగే కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 748 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నారని,ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి : వైసిపి

ప్రజాశక్తి - తుగ్గలి : వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి వైసిపికి ఓట్లు వేసి మరోసారి ఆదరించాలని మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి తనయుడు, వైసీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం తుగ్గలిలో పత్తికొండలో జరిగే 'మేం సిద్ధం' పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13వ తేదీ జరుగుతున్న పోలింగ్ రోజు రెండు ఓట్లు ఫ్యాన్‌కు వేసి ఎంపీగా బివై రామయ్యను, ఎమ్మెల్యేగా శ్రీదేవిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గళం సభకు బొగ్గుల దస్తగిరి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్ : చిలకలూరిపేట బొగ్గులపూడిలో టిడిపి నిర్వహించిన ప్రజాగళం సభకు కోడుమూరు నియోజకవర్గం నుంచి పలువురు నాయకులతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి ఆదివారం వెళ్లారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని, దాన్ని అంతమొందించడానికి ప్రజలు గొంతు విప్పాలని అన్నారు. సభకు హాజరైన వారిలో కర్నూల్ మండల మాజీ కన్వీనర్ బుర్ర వెంకటేష్, యువ నాయకులు రేమట వెంకటేష్, రామాంజనేయులు, కురుకుంద వీర కుమార్, ఐటీడీపి కోడుమూరు నియోజకవర్గ అధ్యక్షులు బోయ కృష్ణ, పూడూరు మా బాషా, పోలకల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి అధిష్టానం పునరాలోచించాలి

- తిక్కారెడ్డికు న్యాయం చేయాలని కాగడాలతో నిరసన

ప్రజాశక్తి - కౌతాళం

టిడిపి అధిష్టానం మంత్రాలయం నియోజకవర్గం టికెట్ విషయంలో పునరాలోచించి తిక్కారెడ్డికి న్యాయం చేయాలని పార్టీ నాయకులు ఆదివారం కౌతాళంలో కాగడాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక పార్టీ కార్యాలయం నుండి మంత్రాలయం, పెద్దకడబూరు, కోసిగి, కౌతాళం నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి కృష్ణ అవధూత ఆశ్రమం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడుతూ 15 సంవత్సరాల నుండి పార్టీ కోసం పని చేశామని, వైసిపి దౌర్జన్యాలను ఎదుర్కొని కార్యకర్తలకు కాపాడుకున్నామని తెలిపారు. పార్టీ ఆదేశించిన కార్యక్రమాలు ప్రతి గ్రామంలో విజయవంతం చేశామని, ఇంత కష్టపడి పనిచేసినా టికెట్ రాకపోవడం బాధాకరమన్నారు. మూడు నెలల ముందు వై బాలనాగిరెడ్డి కోవర్ట్ పార్టీలో వచ్చి చేరిన వ్యక్తికి టికెట్ ఇవ్వడం అన్యాయమన్నారు. నాయకులు మాట్లాడుతూ మంత్రాలయం గడ్డపై తెలుగుదేశం పార్టీ జెండా ఎగరాలంటే తిక్కారెడ్డికి టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా నారా చంద్రబాబు నాయుడు పునర్ ఆలోచించి పార్టీ కోసం కష్టపడిన తిక్కారెడ్డికి టికెట్ ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీనివాస్ రెడ్డి, చెన్న బసప్ప, అడివప్ప గౌడ్, కొట్రేష్ గౌడ్, వెంకటపతి రాజు, టిప్పు సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

తిక్కారెడ్డికు న్యాయం చేయాలని కాగడాలతో నిరసన చేస్తున్న దృశ్యం

సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదు

- పంచాయతీ సెక్రటరీపై చర్యలు తీసుకోని ఎంపిడిఒ

- బాధిత వికలాంగురాలు రంగమ్మ

ప్రజాశక్తి - పత్తికొండ

తన సమస్యను పరిష్కరించాలని ఎంపిడిఒకు విన్నవించినా పట్టించుకోవడం లేదని బాధిత వికలాంగురాలు రంగమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. ఆదివారం ఆమె స్థానిక మీడియాతో మాట్లాడుతూ పత్తికొండ మండలం హొసూరు గ్రామంలో తన తండ్రి చిన్న రామన్నకు సంబంధించి సెంటు స్థలాన్ని పంచాయతీ సెక్రటరీ పెద్దమునెప్ప రాసిచ్చాడని 20 రోజులు క్రితం ఆర్‌డిఒకు ఫిర్యాదు చేసినా, ఎంపీడీవో కలిసి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించినా ఇప్పటివరకు అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పంచాయతీ సెక్రటరీపై చర్యలు తీసుకోకపోవడం వెనక ఆంతర్యమేమిటని వాపోయారు. తన తండ్రి స్థలంపై పూర్తి విచారణ చేసి న్యాయం చేయాలని ఎంపీడీవోను కోరగా పంచాయతీ సెక్రెటరీ ఏమి రాస్తే అదే ఇస్తానని దబాయించారని, అధికారులు న్యాయం చేయకపోతే రాబోయే రోజుల్లో జరిగే పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది.

మాట్లాడుతున్న బాధిత వికలాంగురాలు రంగమ్మ

రాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యం : గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

రాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని ఆ పార్టీ పాణ్యం నియోజకవర్గ అభ్యర్థి గౌరు చరిత రెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ 32వ వార్డు టైలర్స్ కాలనీ (ముజఫర్ నగర్)లో 'సూపర్ సిక్స్-బాబు డోర్ టు డోర్ శంఖారావం' కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ కరపత్రాలను పంచుతూ వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఆమె ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ ఎన్‌వి రామకృష్ణ, వార్డ్ నాయకులు టైలర్ నాగరాజు, ఖాజా బందే నవాజ్, సోమన్న, కెవి శేఖర్, రవి ప్రకాష్ రెడ్డి, జనసేన నాయకులు సుధాకర్, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

32 వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న గౌరు చరిత రెడ్డి

ఎన్నికల నియమావళిని పాటించాలి

- కర్నూల్ కమిషనర్ భార్గవ్ తేజ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్ : కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమావళిని తప్పనిసరిగా పాటించాలని అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, కర్నూల్ కమిషనర్ భార్గవ్ తేజ తెలిపారు. ఆదివారం నగరపాలక సంస్థ పాత కౌన్సిల్ హాల్లో అన్ని రాజకీయ పార్టీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూలు విడుదలైన సందర్భంగా నియోజకవర్గ పరిధిలో ఎన్నికల నియమావళి అమల్లో ఉందన్నారు. కాన్వాసింగ్, లౌడ్ స్పీకర్స్, తాత్కాలిక కార్యాలన్నీ ప్రారంభించడం, ట్రీట్ కార్నర్ మీటింగులు, ఊరేగింపులు, మీటింగులు, బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగులు, ప్రదర్శించడం కోసం అనుమతుల కోసం ఆన్లైన్లో (https://suvidha.eci.gov.in) ఎలా అప్లై చేసుకోవాలో డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. అనుమతులు లేని పోస్టర్లు, బ్యానర్లను ప్రచార సాధనాలను తొలగిస్తామన్నారు. ఇప్పటికే అన్ని రాజకీయ నాయకుల విగ్రహాలను కప్పి ఉంచామన్నారు. అన్ని రాజకీయ పార్టీల బ్యానర్లను కూడా తొలగించామని తెలిపారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పీ.వీ. రామలింగేశ్వర్, కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం ఏఆర్ఓ కర్నూలు అర్బన్ తాసిల్దార్ మోహన్ కుమార్, టౌన్ ప్లానింగ్ ఇన్చార్జి డిసిపి సంధ్య, ఏసీబీ మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ నోడల్ అధికారి రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో సినీ నటుడు జగ్గేష్

ప్రజాశక్తి - మంత్రాలయం : ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీ రాఘవేంద్రస్వామిని కర్నాటక రాష్ట్ర సినీ నటులు, కర్నాటక రాజ్యసభ సభ్యులు జగ్గేష్ ఆదివారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న ఆయనకు శ్రీ మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహమూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం స్వామీజీ వారి ఆశీస్సుల కోసం వెళ్లిన ఆయనకు శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు శేష వస్త్రం, ఫల మంత్రాక్షతలు, మెమొంటో అందజేసి ఆశీర్వదించారు.

స్ట్రాంగ్ రూములను ఎన్నికల అధికారి తనిఖీ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఏ భార్గవ్ తేజ రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌లను మున్సిపల్ అధికారులు, టిడ్కో, ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. స్ట్రాంగ్ రూముల సంసిద్ధతను స్వయంగా పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

బ్యానర్ల ఏర్పాటుకు అనుమతి లేదు

ప్రజాశక్తి - ఆదోని : ఆదోని పట్టణ వీధుల్లో రాజకీయ నాయకులకు సంబంధించిన బ్యానర్ల ఏర్పాటుకు అనుమతి లేదని మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ రోడ్డులో గతంలో ఏర్పాటు చేసిన బ్యానర్లను తీసి వేయించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, సచివాలయాల్లో పోస్టర్లు, ఫొటోస్ తొలగించామన్నారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు ఉద్యోగులు విధులు నిర్వర్తించాలన్నారు. ఏ రాజకీయ పార్టీ నాయకుడికి అనుకూలంగా వ్యవహరించరాదని, అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

రోడ్ల లో బ్యానర్ల తొలగింపు ను పరిశీలించిన కమిషనర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, డిఆర్‌ఓ తదితరులు

దేశాన్ని బలహీనపరిచే చట్టం సిఎఎ

- అమలును అడ్డుకోవాలి
- ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ చిష్టీ

సదస్సులో మాట్లాడుతున్న ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ చిష్టీ

ప్రజాశక్తి - నంద్యాల

దేశాన్ని బలహీనపరిచే చట్టం సిఎఎ అని, దాని అమలును అడ్డుకోవాలని సదస్సులో పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల జిల్లా కేంద్రంలోని అబుల్ కలాం ఆజాద్ షాదిఖానాలో వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ పార్టీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 'రాజ్యాంగ పునాదిపై దాడి - సిఎఎను వ్యతిరేకించండి' అంశంపై సదస్సు జమాతే ఇస్లామిక్ హింద్ అధ్యక్షులు సమ్మద్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ చిష్టీ హాజరై ప్రసంగించారు. రాజ్యాంగానికి విరుద్ధంగా, దేశ సమైక్యతకు ప్రమాదకరమైన సీఏఏ నిబంధనలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 2019లో ఆమోదించబడిన సిఏఏ చట్టాన్ని ప్రజా ఆందోళన వల్ల ఐదేళ్లు మూలన పెట్టి ఇప్పుడు కొద్ది రోజులలో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందనగా దాన్ని అమలు పరిచేందుకు ప్రకటించడం స్పష్టంగా ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకు బిజెపి ఆడుతున్న ప్రమాదకరమైన నాటకంలో భాగమే అన్నారు. ఈ చట్టం దేశంలోని ముస్లిం ప్రజానీకం పట్ల తీవ్రమైన వివక్షను ప్రదర్శిస్తుందన్నారు. దీనితోపాటు అస్సాంలో జారీ చేసిన జాతీయ పౌరసత్వ రిజిస్టర్ (ఎన్ఆర్‌సి)ని దేశమంతటికీ విస్తరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. దీనివల్ల దేశంలోని ముస్లిం ప్రజలకే కాక హిందువులు, ఇతర ప్రజానీకానికి కూడా నష్టం జరుగుతుందన్నారు. ఎందుకంటే దేశంలోని 140 కోట్ల జనాభా అంతా భారత పౌరులమేనని నిరూపించుకోవాలని, సరైన పత్రాలు లేని వారంతా విదేశీయులుగా ముద్రపడి శరణార్థి శిబిరాలలో బతకాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే ఈ చట్టం పట్ల దేశవ్యాప్తంగా ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం అవుతుందని, అస్సాంతో సహా ఈశాన్య రాష్ట్రాల్లోని మూలవాసులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారని, సిపిఎం, కాంగ్రెస్ ఇతర ప్రతిపక్షాలు బిజెపి ప్రభుత్వ దుష్ట చర్యలను ఖండించాయన్నారు. కేరళ, తమిళనాడు, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయబోమని ప్రకటించాయన్నారు. రాష్ట్రంలోని వైసీపీ, తెలుగుదేశం, జనసేన పార్టీలు మాత్రం దీనిపై నోరు మెదపడం లేదన్నారు. వైసీపీ రాష్ట్ర ప్రభుత్వం కూడా సిఎఎను అమలు చేయబోమని ప్రకటించాలన్నారు. రాబోయే ఎన్నికలలో బిజెపికి మద్దతు ఇచ్చే వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను ఒంటరిని చేసి ఓడించాలని పిలుపునిచ్చారు. అలాగే సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్, పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు, ప్రజా లౌకిక ఐక్యవేదిక కన్వీనర్ అబులైజ్, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు డాక్టర్ చింతల మోహన్ రావు, సిపిఐ(ఎంఎల్) కార్యదర్శి శంకర్, క్రిస్టియన్స్ జేఏసీ అధ్యక్షులు భాస్కర్ రాజు, ఐయుఎంఎల్ అధ్యక్షులు మౌలానా అబ్దుల్ సయ్యద్, వెల్ఫేర్ పార్టీ అధ్యక్షులు అన్సర్, ముస్లిం హక్కుల పోరాట సమితి అధ్యక్షులు యూనుస్, జాను జాగో జాతీయ కార్యదర్శి సయ్యద్ బాష, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు మస్తాన్వలి, తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కే ఎం డి గౌస్, డి లక్ష్మణ్ , వెంకట లింగం, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చింతలయ్య జిల్లా నాయకులు రత్నమయ్య, పట్టణ నాయకులు జైలాన్, యువజన నాయకులు సాయి, హరి, మా బాష తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా ఎన్నికల నియమావళి

జిల్లా ఎన్నికల అధికారి కె. శ్రీనివాసులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

భారత ఎన్నికల సంఘం సాధారణ ఎన్నికల షెడ్యూల్ వెలువరించిన నేపథ్యం లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె. శ్రీనివాసులు రిటర్నింగ్ అధికారులను, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ లను ఆదేశించారు. ఆదివారం ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్ట అమలుపై జిల్లా ఎన్నికల అధికారులు తీసుకుంటున్న చర్యలపై రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్, డిఆర్ఓ ఎ. పద్మజ తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారి కె. శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్ట్ (ఎంసిసి) అమలును పటిష్టంగా అమలు చేయాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా సంబంధిత అధికారులను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. సీ విజిల్ యాప్‌కు ప్రజల నుండి ఫిర్యాదులు వస్తున్నాయని మరింత బలోపేతం చేసి యాప్ నుంచి వచ్చే ఫిర్యాదులకు 100 నిమిషాలలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాని కలెక్టర్ ఆదేశించారు. ఎంసిసి, ఎఫ్.ఎస్.టీ టీమ్ లు పర్యటించేందుకు సోమవారం ఉదయంలోగా వాహనాలను అందుబాటులో ఉంచాలని డిటిఏను ఆదేశించారు. ఎఫ్ ఎస్‌టీ టీమ్‌లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రవర్తన నియమావళిపై 100 శాతం పూర్తిస్థాయి దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని గ్రామ పంచాయతీలు, సచివాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలపై ఉన్న రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లు, ఫోటోలను, ఇతర క్యాలెండర్లు, జెండాలను, బస్టాండ్, రైల్వే స్టేషన్లలో, రోడ్డు కిరువైపులా, ముఖ్య కూడలి ప్రాంతా ల్లోని అన్ని హెూర్డింగులను రిటర్నింగ్ అధికారులు, సంబంధిత ఏఆర్వోలు, ఎంపిడిఓ లతో మాట్లాడి తక్షణమే తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్డబ్ల్యూఎస్, ఏపీఎస్పి డీసీఎల్, ఎగ్జిక్యూటివ్ ఆన్ గోయింగ్ వర్కులు మినహా కొత్త పనులు ఏవి చేపట్టవద్దని కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల జాబితాను సోమవారం సాయం త్రంలోగా అందజేయాలన్నారు. అంతకుముందు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లో రాజకీయ ప్రకటనలతో ఉన్న హోర్డింగ్లను, పోస్టర్లు, కటౌట్లను తక్షణమే తొలగించాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ఎన్నికల షెడ్యూలు ప్రకటించినప్పు నుండి 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లోను, 48 గంటల్లో ప్రైవేటు వ్యక్తుల స్థలాల్లోనూ అనుమతి లేకుండా ఉన్న రాజకీయ ప్రకటనలను తొలగించాల్సి ఉందన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ఈ నియమ నిబంధనలను పటిష్టంగా అమలు పర్చేలా చర్యలు తీసుకో వాలన్నారు. కొన్ని జిల్లాలకు సంబంధించి జిల్లా ఎన్నికల నిర్వహణ ప్రణాళికలు ఇప్పటి వరకూ తమకు అందకపోవడం వల్ల రాష్ట్ర ఎన్నికల నిర్వహణ ప్రణాళికను సమగ్ర స్థాయిలో రూపొందించలేక పోయామనే విషయాన్ని సంబందిత జిల్లాల ఎన్నికల అధికారులు గుర్తించాలన్నారు. ఈ విషయంలో ఇంక ఏమాత్రము ఆలస్యం చేయకుండా నేటి సాయంత్రం లోపు తమ కార్యాలయానికి జిల్లా ఎన్నికల నిర్వహణా ప్రణాళికలను పంపాలని ఆదేశించారు. సి-విజిల్లో అందే ఫిర్యాదులపై 100 నిమిషాల్లోపు, ఎన్నికల సంఘం నుండి అందే ఫిర్యాదులపై అదే రోజు, మీడియాలో ప్రచురితమయ్యే, ఇతర ఫిర్యాదులపై 24 గంటల్లో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సెక్టోరల్ అధికారులకు మెజిస్టీరియల్ అధికారులు ఇచ్చే ప్రతిపాదనల ను వెంటనే హెూమ్ శాఖకు పంపాలని సూచించారు.

బొప్పాయికి వైరస్, తెగుళ్ల బెడద..

- తగ్గిన దిగుబడులు
- లభించని గిట్టుబాటు ధర
- నష్టాల బాటలో రైతన్నలు

వైరస్ తెగులుతో దెబ్బతిన్న బొప్పాయి పంట

ప్రజాశక్తి - రుద్రవరం

ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు వైరస్ తెగుళ్ల కారణంగా బొప్పాయి పంట దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. రుద్రవరం మండలంలోని ఆలమూరు, నరసాపురం, రుద్రవరం, రెడ్డిపల్లి, ఆర్ నాగులవరం, తువ్వపల్లి, ముత్తలూరు, తదితర గ్రామాలలో రైతులు బోరుబావుల కింద దాదాపు 100 ఎకరాలలో పైగా బొప్పాయి పంట సాగు చేశారు. ఒక్కో రైతు ఎకరాకు దాదాపు రూ 1.30 లక్షల పెట్టు బడులతో రెడ్ లీడ్ 786 అనే రకం బొప్పాయి పంటను పసుపులో మిశ్రమ పంటగాసాగు చేశారు. ఈ పంట మొదట్లో చెట్లు ఏపుగా పెరిగి ఆశా జనకంగా ఉండడంతో రైతులు ఎంతో సంతోషం తో పంటను సాగు చేశారు. అయితే వర్షాభావ పరిస్థితులు వాతావరణ మార్పుల కారణంగా వైరస్ తెగులు సోకడంతో పంట దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. ఎకరాకు గత ఏడాది 25 టన్నుల దాకా దిగుబడులు వచ్చేవని రైతులు తెలిపారు. అయితే ఈ ఏడాది 10 నుంచి 12 టన్నుల వరకు అంతంత మాత్రంగానే దిగుబడులు వస్తున్నాయని రైతులు తెలిపారు. గత ఏడాది ఒక టన్నుకు రూ17000 ధర పెట్టి వ్యాపారులు పంటను కొనుగోలు చేశారని ఆర్ నాగులవరం గ్రామానికి చెందిన రైతువెంకటసుబ్బ నరసయ్య తెలిపారు. అయితే ఈ ఏడాది టన్నుకు రూ 12 వేల రూపాయలు మాత్రమే వ్యాపారులు ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారన్నారు. దీంతో పంటకు సరైన గిట్టుబాటు ధర పలక కోవడం కాకుండా పంట దిగుబడులు కూడా సగానికి సగం పడిపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట సాగు చేస్తే తెగుళ్ల కారణంగా అరకొరగా వచ్చిన పంటను కూడా వ్యాపారులు గిట్టుబాటు ధర పెట్టి కొనుగోలు చేయడం లేదని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు దెబ్బతిన్న పంటలకు పంటల బీమా పథకాన్ని వర్తింపజేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

లారీలో బొప్పాయి కాయలు నింపుతున్న కూలీలు

కాయలు కోస్తున్న కూలీలు

ప్రశాంతంగా గ్రూప్- 1

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో గ్రూప్- 1 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల పట్టణం శ్రీనివాస సెంటర్‌లోని నేషనల్ డిగ్రీ కాలేజీలో నిర్వహిస్తున్న ఏపీపిఎస్సి గ్రూప్- 1 పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డిలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీ లలితా నగర్ లోని గురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్లో నిర్వహిస్తున్న ఏపీపిఎస్సి గ్రూప్- 1 పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జిల్లాలో ఏడు వెన్యూ కేంద్రాలలో నిర్వహించిన గ్రూప్ - 1 పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయన్నారు. పరీక్షలకు 3,675 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 2,302 మంది హాజరయ్యారని 1,373 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. 62.06 శాతం అభ్యర్థుల హాజరు నమోదు అయిందన్నారు. ఆదివారం ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు, మధ్యాహ్నం 02:00 గంటల నుంచి 04:00 వరకు రెండు సెషన్‌లలో పరీక్షలను నిర్వహించడం జరిగిందన్నారు. పరీక్షల కోసం 7 మంది లైజన్ ఆఫీసర్ల (సీనియర్ జిల్లా స్థాయి అధికారులు)ను, 7 మంది చీఫ్ సూపరింటెం డెంట్‌లను నియమించడం జరిగిందన్నారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతంగా, ప్రశాంతంగా పరీక్షలు ముగిశాయని జిల్లా కలెక్టర్ తెలిపారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరుతున్న వైసీపీ నాయకులు

15 కుటుంబాలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కొలిమిగుండ్ల మండలం అబ్దుల్లాపురం గ్రామానికి 15 ముస్లిం కుటుంబాలు టిడిపిని వీడి వైసిపిలో చేరారు. ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు అంబటి జయలక్ష్మి రెడ్డి, అశ్రీత్ రెడ్డి, వెంకట రామి రెడ్డి, భూపాల్ ఆధ్వర్యంలో మైనారిటీ యువకులు హాసన్ వలి, హాజీసా, బావాజీ, హుస్సేన్ షా, హాజషా, బాబావాలి, సురేష గౌడ్, పెద్ద హాజషా, లక్ష్మన్న, బోయ సుదర్శన్, మదార్ వలి తదితర 15 కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి టిడిపి పార్టీ కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీడీపీలో చేరిన వారు మాట్లాడుతూ 5 సంవత్సరాల జగన్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాలలో వెనుకబడిపోయిందని, కాటసాని రామిరెడ్డి హయాంలో బనగానపల్లెలో అభివృద్ధి అనేది మచ్చుకైనా లేకుండా పోయిందని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు, చంద్ర బాబుతో, బనగానపల్లెలో అభివృద్ధి బీసీ జనార్థన్ రెడ్డితోనే సాధ్యమని నమ్మి టీడీపీలో చేరినట్లు తెలిపారు.. రాబోయే ఎన్నికల్లో జనార్థన్ రెడ్డి ని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుని, బనగానపల్లె గడ్డపై తెలుగుదేశం జెండా ఎగరడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. అనంతరం బీసీ జనార్ధన్ రెడ్డి పార్టీలో చేరిన వారికి సముచిత ప్రాధా న్యత ఇస్తామని హామీ ఇచ్చారు. అందరం ఈ 50 రోజులు కష్టపడి తెలుగుదేశం పార్టీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

30 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరిక

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ బీసీ జనార్ధన్ రెడ్డి సమక్షంలో 30 కుటుంబాలు టిడిపి లో చేరాయి. ఆదివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కోవెలకుంట్ల పట్టణంలోని సంతపేటకు చెందిన కర్ణమయ్య వీధి కి చెందిన రబ్బానీ, సలామ్, గౌస్ పీరా, వలి, నూర్ మహమ్మద్, జిన్నా, చిన్న రబ్బానీ, నూర్, షాకీర్, అసిఫ్, మెకానిక్ వలి షేక్ అబ్దుల్, జిలాన్, షేక్ సలామ్, అక్బర్, ఇలియాజ్, ఆఫ్రిద్ తదితర 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు వీరికి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి టిడిపి పార్టీ కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు.

నియమాలను ఉల్లంఘిస్తే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి - పాములపాడు

సార్వత్రిక ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి శాంతి భద్రతలకు విగాథం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని పాములపాడు ఎస్సై జి అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని ఎర్ర గూడూరు, భానుముక్కల, బాణాకచర్ల గ్రామాలలో కేంద్ర బీఎస్ఎఫ్ పోలీస్ బలగాల తో కావత్తు నిర్వహించారు. ఎస్సై జి అశోక్ గ్రామా లలో ప్రజలకు ఎన్నికల నియమావళి శాంతి భద్రతలపై సూచనలు చేశారు. ప్రతి ఒక్కరు తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎన్నికల కోడ్ సమయంలో అల్లర్లకు పాల్పడితే కేసులు బనాయించడం జరుగుతుందన్నారు. ఎవరికి భయపడకుండా ప్రజలు తమ ఓటును వినియోగించుకోవాలని గ్రామాలలో ఎలాంటి ఇబ్బందులు కలిగిన పోలీసు వారికి సమాచారం ఇవ్వాలన్నారు. వీఆర్వో హుస్సేన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నియమాలు సూచనలు చేస్తున్న ఎస్ఐ జి అశోక్

మామిడి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఈ సంవత్సరం వర్షాలు రాక తెగుళ్లు, పూత నిలబడక కాయ బపిండెలతో రాలిపోతున్నాయని మామిడి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ. రాజశేఖర్, పండ్లతోటల రైతు సంఘం నాయకుడు మహబూబ్ బాషా, ఎం వీరన్న, సిఐటియు నాయకులు ఏ.రణధీర్, ఎం వీరన్న, ఏ. సురేంద్ర, ఆత్మకూరు మండలంలో ఉన్న మామిడి తోటలను పరిశీలించగా ఈ సందర్భంగా రైతులు రైతు బందంతో మాట్లాడారు. నంద్యాల జిల్లాలో వెలుగోడు, ఆత్మకూరు, కొత్తపల్లె, గడివేముల, బేతంచెర్ల బనగానపల్లె, మహానంది మండలాలలో వేలాది ఎకరాల్లో మామిడి తోటల్లో సంవత్సరం వర్షాలు తక్కువగా ఉన్నాయని వీటివల్ల మామిడి తోటలకు నల్ల తామర పురుగు సోకి నూటికి 90 శాతం మామిడి పంట పూర్తిగా దెబ్బతిని నష్టపోయామని, ప్రతి సంవత్సరం ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో మొదటి పూత రావడం జరుగుతుందని ఈ సంవత్సరం జనవరి నెలలో రెండోసారి పూత కూడా వచ్చింది కానీ ఆ పూత నిలబడక కాయ బపిండెలతో సహా రాలిపోవడం జరుగుతుందని రైతులు ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలు దెబ్బతింటున్నాయని పెట్టిన పెట్టుబడి రాక ప్రతి సంవత్సరం నష్టపోతున్నారని దీనికి తోడు ప్రభుత్వం సకాలంలో మామిడి పండ్ల ఎగుమతులను సకాలంలో చర్యలు చేపట్టడం లేదని రైతులు వాపోయారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్, పనులతోటల రైతు సంఘం జిల్లా నాయకుడు బైరాపురం మహబూబ్ బాషా, ఎం.వీరన్న మాట్లాడుతూ నష్టపోయిన మామిడి తోట రైతులందరికీ ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని ఆర్టికల్చర్ అధికారుల పంటల పర్యవేక్షణ సరైనటువంటి పద్ధతిలో లేదని రైతుల తోటలను పరిశీలించి ఆ తోటలకు పట్టినటువంటి తెగుళ్ళకు నివారణకు సరైన మందులు చల్లేలా చర్యలు చేపట్టే విధంగా రైతులకు సలహాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటల బీమా పథకంలో మామిడి తోటల రైతులకు కూడా వర్తింపజేసి వెంటనే నష్టపరిహారం ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటలకు ప్రత్యేక ప్రోత్సాహాలు ఇస్తామని గతంలో ప్రకటించినప్పటికీ ఆచరణలో రైతులకు ఎలాంటి సహకారం అందలేదన్నారు. రైతులకు ఉచిత బోర్లు, డ్రిప్పు, స్ప్రింగ్ పరికరాలు సబ్సిడీ మీద అందించడం లేదని నల్ల తామర పురుగు నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని, భవిష్యత్తులో అయినా మామిడి తోట రైతుల నష్టాలను నివారించే చర్యలు ప్రభుత్వం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహబూబ్ బాషా పండ్ల తోటల సంఘం నాయకుడు మామిడి తోట రైతు తన పొలాన్ని ప్రతినిధులకు చూపించారు. అమలాపురం తెలుగు శివన్న, నారాయణ, తోటలను కూడా రైతు బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిపండును పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ తదితరులు

వైసిపికి ఉమ్మడి ఆది హుస్సేన్ రెడ్డి రాజీనామా

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్ట ణానికి చెందిన వైసిపి నాయకులు ఉమ్మడి ఆది హుస్సేన్ రెడ్డి పార్టీకి రాజీనామా చేసినట్లు ఆదివారం తెలిపారు. ఒకప్పుడు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ప్రధాన అనుచరునిగా ఉన్న ఉమ్మడి ఆది హుస్సేన్ రెడ్డి ఏడు సంవత్సరాలుగా పార్టీకి దూరంగా ఉన్నారు. ఆయన మాట్లాడుతూ ఏడు సంవత్సరాలుగా వైసిపి పార్టీకి దూరంగా ఉంటున్నానని వైసీపీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. గతంలో తెలిసి తెలియక వైసిపి పార్టీ కోసం, నాయకుని కోసం కొన్ని తప్పులు చేశానని ప్రజలు క్షమించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరనున్నట్లు తెలిపారు.

మంత్రి బుగ్గనను ప్రజలు నమ్మరు

- డోన్ అసెంబ్లీ టిడిపి అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి

ప్రజాశక్తి-డోన్

డోన్ నియోజకవర్గం అంతా తానే అభివద్ది చేసినట్లు మంత్రి బుగ్గన చెప్పే మాయమాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని డోన్ అసెంబ్లీ టిడిపి అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 16,17,26,27 వార్డులలో ఎన్నికల ప్రచారం కోట్ల నిర్వహించారు. టిడిపి మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి తిరిగి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. కోట్ల కూతుర్లు కోట్ల నివేదిత కోట్ల చిత్రమ్మ ప్రచారంలో పాల్గొని టిడిపిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ డోన్ నియోజకవర్గాన్ని కోట్ల కేఈ కుటుంబాలు ఎంతో అభివృద్ధి చేశాయన్నారు. డోన్ నియోజకవర్గంలో రూ.2500 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు మంత్రి బుగ్గన గ్లోబల్ ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. మెయిన్ రోడ్లకు తాము కట్టించిన వాటర్ ట్యాంకులకు రంగులు వేసి తాను ఏదో చేసినట్టు చూపించుకోవడం సిగ్గుచేటు అన్నారు. కోట్ల సుజాతమ్మ డోన్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే రూ 52 కోట్లతో ప్రజలకు గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి శుద్ధ జలం అందించామన్నారు. మంత్రి బుగ్గన అభివృద్ధి అంతా కాంట్రాక్టర్లకే తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. డోన్‌లో టిడిపి జెండాను ఎగురవేస్తామని కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో కోట్ల గిరిధర్ రెడ్డి,లక్కసాగరం లక్ష్మిరెడ్డి,విజయ్ కుమార్ రెడ్డి,టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పణిరాజ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టియి.కేశన్నగౌడ్,మద్రిరమణ,ఓబుళాపురం శేషిరెడ్డి, ఓం ప్రకాష్, చిట్యాల మద్ద య్య గౌడ్,కెఈశ్యామ్,భాష్యం శ్రీధర్ గౌడ్,పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ మహమద్ రఫీ,వెంకటేష్,వడ్డే మాణిక్యం,జనసేన,బిజెపి నాయకులు పాలరాజు, పుల్లయ్య, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

డోన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి

లైసెన్స్ రెన్యువల్‌కు ముందుకు రాని డీలర్లు

- పట్టించుకోని మండల వ్యవసాయ అధికారులు..
- వ్యవసాయ శాఖకు లైసెన్స్ ఫీజు ఎగవేత

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఫెస్టిసైడ్స్ డీలర్లు లైసెన్స్ రెన్యూవల్ చేయించుకునేందుకు ముందుకు రావడం లేదు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం 7 మండలాల నుండే ఫెస్టిసైడ్స్ డీలర్ల నుండి లైసెన్స్ రెన్యువల్‌కు జిల్లా వ్యవసాయ అధికారి వద్దకు దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. జిల్లాలో 28 మండలాలు ఉన్నాయి. 28 మంది మండల వ్యవసాయ అధికారులు ఉన్నారు. కానీ కేవలం 7 మండలాల నుండే రెన్యూవల్ కోసం దరఖాస్తులు వచ్చాయి. మిగిలిన 21 మండలాల ఏఓలు డీలర్ల లైసన్స్‌లు రెన్యూవల్ చేయించకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లైసన్స్‌లు రెన్యూవల్ చేసుకోవడం వలన డీలర్ షిప్ పరిగణలో ఉంటుంది..

అలాగే ఆ డీలర్ ఏడాదిలో చేపట్టిన లావాదేవీలా వివరాలు అధికారులకు సమర్పించాలి. అలా వివరాలు ఇవ్వని డీలర్‌లకు స్టాప్ సేల్స్ కింద నోటీసులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ కార్యాలయం నుండి ఏవోలకు పంపినా ఏవోల నుండి స్పందన లేకపోవడం విడ్డూరం. డీలర్లు చేసిన తప్పులను కప్పి పుచ్చేందుకే ఏవోలు తాత్సారం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. రీమార్కులు ఉంటాయనే భయంతోనే ఏవోలు జిల్లా కార్యాలయంకు పంపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆత్మకూర్ డివిజన్, నందికొట్కూరు, డోన్, బేతంచెర్ల మండలాల నుండి మాత్రమే లైసన్స్ రెన్యూవల్ కోసం దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం..

'పది' పరీక్షలకు పటిష్ట భద్రత

- జిల్లా కలెక్టర్ కే. శ్రీనివాసులు

మీడియాతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నేటి నుండి ఈనెల 30వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించనున్న పదవ తరగతి పరీక్షలుకు ప్రభుత్వ మార్గ దర్శకాల మేరకు అన్ని చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ కే. శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 134 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రెగ్యులర్ విద్యార్థులు 24223, ప్రయివేటు విద్యార్థులు 6019 మొత్తం 30,242 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలు జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించుటకు చీఫ్ సూపరింటెండెంట్స్134 మంది, డిపార్టెంటల్ ఆఫీసర్స్ 134, అడిషనల్ డిపార్టెంటల్ ఆఫీసర్స్ 32, ఫ్లైయింగ్ స్క్వాడ్స్ 5 మంది, టీమ్స్, ఇన్విజి లేటర్స్ 1,750 మందిని నియమించిన్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ పరీక్షలను పర్య వేక్షించుటకు జిల్లా స్థాయి పరిశీలకులుగా ఎండిఎం జాయింట్ డైరెక్టర్ ఆర్. యస్. గంగా భవాని ప్రభుత్వం నియమించి నట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షల విధులలో ఉన్న సిబ్బంది అందరికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించామని, పరీక్ష కేంద్రము "నో సెల్ ఫోన్ జోన్"గా ప్రకటించడం జరిగిందన్నారు. కావున సిబ్బంది ఎవ్వరు పరీక్షా కేంద్రం లోకి సెల్ ఫోన్ తీసుకోనిరాకూడదన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే క్రమ శిక్షణ చర్యలు తీసుకోనబడునని హెచ్చరించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఇతరులు ఎవరు ఉండకుండా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. పరీక్షా కేంద్రాల సమీపమున ఉన్న అన్ని జిరాక్స్ షాప్స్,కంప్యూటర్ సెంటర్స్ పరీక్ష వేలల్లో తెరవకూ డదని ఆదేశించారు. పది పరీక్షలను ప్రభుత్వం సక్రమంగా నిర్వహించుటకు, విద్యార్థ లు ఇబ్బంది పడకుండా ఉండుటకు రవాణాకు బస్సులు, బందోబస్త్‌కు పోలీసులు, కరెంట్ నిర్వహణకు ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ సిబ్బందిని, పరీక్ష కేంద్రాలలో ఎవరైనా విద్యార్థులు అస్వస్థతకు గురైనచో,వైద్య సిబ్బందిని, ఇతర లైన్ డిపార్టుమెంటులను సమయాత్త పరిచి ఎటువంటి విఘాతం కలుగకుండా ప్రభుత్వం పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరీక్షల్లో తప్పిదాలకు అవకాశం లేకుండా చేయడంతో పాటు అత్యధునీక వ్యవస్థను అమలు లోకి తెచ్చిందని,ప్రభుత్వ పరీక్షల విభాగం పది ప్రశ్నలకు సాంకేతిక పరిజ్ఞానంతో రూపకల్పన చేసిందన్నారు. పరీక్షలల్లో ఎక్కడైనా పేపర్ లికేజికి గురైతే అది ఎక్కడ ఏ పరీక్షా కేంద్రంలో, ఏ రూములో, ఏ విద్యార్థి ప్రశ్న పత్రం నుంచి జరిగిందనే సమా చారం తెలుసుకొనే వ్యవస్థను అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ వ్యవస్థ వలన కొంతమంది పని కట్టుకొని వ్యాపింప చేసే పుకార్లను అడ్డుకట్ట వేయటం తోపాటు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకొనేందుకు ఆస్కారం కలుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు గంట ముందు 8:30లోపు కేటాయిచిన పరీక్షా కేంద్రము నకు చేరుకోవ లసినదిగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థులు హాల్ టికెట్స్‌పై ముద్రించి యున్న నియమ నిబంధనలు తప్పని సరిగా పాటించాల న్నారు. పరీక్షా కేంద్రలలో ఫర్నిచర్ తాగునీటిని అందుబాటులో ఉంచడంతో పాటు గాలి వెలుతురూ ప్రసరించే విధంగా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

ఘనంగా భవిష్య స్ఫూర్తి రెడ్డి పుట్టినరోజు

భవిష్య స్ఫూర్తి రెడ్డి ని ఆశీర్వదిస్తున్న భూమా కిషోర్ రెడ్డి, గంగుల అవంతిక రెడ్డి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

స్థానిక ఏవి ప్లాజాలో ఆదివారం స్ఫూర్తి మదర్ హెూం నిర్వాహకులు నాగేశ్వర్ రెడ్డి, అరుణకుమారి దంపతుల కుమార్తె భవిష్య స్ఫూర్తి రెడ్డి మొదటి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక శాసనసభ్యులు గంగుల నాని సోదరి అవంతిక రెడ్డి, తాలూకా వైకాపా నాయకులు భూమా కిషోర్ రెడ్డి, కౌన్సిలర్ సుధామణి, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ బివి రామిరెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త టీఎంసీ వేణుగోపాల్, కూలూరు నరసింహారెడ్డి, గంగుల రామిరెడ్డి, సర్వాయి పల్లె మాజీ సర్పంచ్ రాజా తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు చిన్నారి భవిష్య స్ఫూర్తి రెడ్డి ని ఆశీర్వదించారు. అనంతరం కేక్ కట్ చేసి చిన్నారి భవిష్య స్ఫూర్తి రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థి బస్సు పొడిగించాలి

ప్రజాశక్తి - కొత్తపల్లి

వినతి పత్రం ఇస్తున్న నేతలు

కొత్త పల్లి మండలంలోని పలు గ్రామాల విద్యార్థులకు మధ్యాహ్న సమయంలో గుమ్మడా పురం గ్రామం వరకు వస్తున్న విద్యార్థిని బస్సును ఎర్రమఠం గ్రామం వరకు నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కే దినేష్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి నుంచి ఒంటిపూట పాఠశాలలు ఉండడంతో మండలంలోని ఎర్రమఠం విద్యార్థులకు విద్యార్థి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. మధ్యా హ్నం సమయంలో ఎర్రమఠం విద్యార్థులకు బస్సు సౌకర్యం లేకపోతే విద్యార్థు లు ఇబ్బందులకు గురికా వలసిన పరిస్థితి ఉందన్నారు. ఎర్రమఠం విద్యారు ్థలకు విద్యార్థి బస్సు సౌకర్యం కల్పించి విద్యార్థులను ఆదుకోవాలని ఏపీఎస్ఆర్టీసీ డిపో సిఐ కంట్రోల్ షఫీ ఉల్లాకు వినతి పత్రం ఇచ్చారు. ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సెవెన్ హిల్స్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, కాత్యాయని మెడికల్స్ సహకారంతో

పోలీసులకు కూలింగ్ గ్లాసులు, టోపీలు పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పోలీసులకు కూలింగ్ గ్లాసులు, టోపీలు పంపిణీ చేస్తున్న సెవెన్ హిల్స్ అధినేత మారుతి

సెవెన్ హిల్స్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, కాత్యాయని మెడికల్స్ సహకారంతో నంద్యాల ఒన్ టౌన్ పోలీసులకు రూ. 15 వేల విలువైన కూలింగ్ గ్లాసులు, టోపీలను ఒన్ టౌన్ పోలీసులకు పంపిణీ చేశామని సెవెన్ హిల్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ రెంటాల మారుతి కుమార్ పేర్కొన్నారు. కూలింగ్ గ్లాసులు టోపీలు కావాలని వన్ టౌన్ పోలీసులు సెవెన్ హిల్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఎండి మారుతి కుమార్‌ను సంప్రదించగా రూ. 15 వేలు విలువైన 13 మందికి అందజేశారు. ఈ సందర్భంగా రెంటాల మారుతీ కుమార్ మాట్లాడుతూ పోలీసుల విధులు చాలా కష్టతరంగా ఉంటాయని, వేసవిలో నిరంతరం ఎండ వేడి మికి ఇబ్బంది పడతారని అన్నారు. పోలీసులకు ఎండ నుండి రక్షణ కోసం కూలింగ్ గ్లాసులు, టోపీలను అందించామని తెలిపారు. టోపీలు కూలింగ్ గ్లాసులు అందు కున్న పోలీసులు సెవెన్ హిల్స్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ రెంటాల మారుతి కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఎల్ఈడి బల్బులు అందజేత

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని సీనియర్ న్యాయవాది నాగభూషణం రెడ్డి, ఎం శైలజ దంపతుల కుమారుడు ఎం.నవీన్ కుమార్ జన్మదినం సందర్భంగా బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉన్న ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు ఎల్ఈడి బల్బులను వార్డెన్ లక్ష్మీబాయికి అందించినట్లు డోన్ ఇన్నర్ విల్ క్లబ్ అధ్యక్షురాలు కె.శాలినిప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ హాస్టల్లో విద్యార్థినిలు కరెంటు పోయినప్పుడు చదువుకోవడానికి ఇబ్బందికరంగా ఉంటుందని,అందులో భాగంగా కరెంట్ పోయినప్పుడు విద్యార్థినీలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు చార్జింగ్ ఎల్ఈ డి బల్బులు వారి చదువుకు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు చక్కగా చదువు కొని పరీక్షలలో బాగా రాణించాలని కోరారు. జన్మదినం సందర్భంగా విద్యార్థులకు ఉపయోగపడే ఎల్ఈడి బల్బులను అందించినందుకు ఎం.నవీన్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు మద్దమ్మ హాస్టల్ విద్యార్థినీలు పాల్గొన్నారు.

ఎల్ఈడి బల్బులను హాస్టల్ వార్డెన్ లక్ష్మీబాయికి అందిస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు : సిఐ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని సీఐ గోపీనాథ్ రెడ్డి అన్నారు. కొలిమిగుండ్ల సీఐ గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బెలూం,బెలూం సింగవరం గ్రామాల యందు పోలీసు, బిఎస్ఎఫ్ దళాలు మార్చ్ ఫాస్ట్ కవాతు నిర్వహించారు ఈ సందర్భంగా కొలిమిగుండ్ల సీఐ గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ సమస్యాత్మకమైన గ్రామాల్లో ఎటువంటి ప్రజలకు అల్లర్లు గలాటాలు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరుపుకో వాలని తగిన సూచనలు ఇచ్చారు.

కవాతు చేస్తున్న పోలీసులు

ఎపిడబ్ల్యుజెఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - మహానంది

మాట్లాడుతున్న పాత్రికేయులు

ఏపీడబ్ల్యూజేఎఫ్ మహానంది మండలం కమిటీని ఆదివారం నాడు నంద్యాలలో జరిగిన ఏపీడబ్ల్యూజేఎఫ్ సమావేశంలో ఎంపిక చేయడం జరిగింది. నంద్యాల జిల్లా కన్వీనర్ మద్దయ్య యాదవ్, కో కన్వీనర్ శివ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మౌలాలిలు మహానంది మండల అధ్యక్షులుగా బత్తిని కృష్ణమూర్తి బాబు, ఉపాధ్యక్షులుగా భూమా మహేష్ బాబు, ట్రెజరీగా రఫీలను సభ్యులుగా వెంకటశివుడు, శీను, నాగరాజు, నరసింహ, చంద్రలను నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోరంట్లప్ప, ప్రజాశక్తి డెస్క్ ఇంచార్జ్ చంద్రయ్య, నంద్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి ఏ. జగన్మోహన్‌లు పాల్గొన్నారు.

'వైసిపి పాలన నుంచి విముక్తి'

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో వైకాపా రాక్షస పాలన నుంచి విముక్తి లభించిందని తాలూకా యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ మండలం చింతకుంట గ్రామంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన బాబు సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి తిరిగి కరపత్రం పంచుతూ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రజలు వైకాపా నియంతత్వ పాలనను చూశారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు వైకాపాకు బుద్ధి చెప్పి టిడిపికి ఓట్లు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకు లు సిద్ధం రెడ్డి జాఫర్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, అనంత రామ సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న శెట్టి విజయకుమార్

బలిజలకు అండగా నిలబడే

పార్టీలకే మద్దతు

- శెట్టి విజయకుమార్, దాసరి రాము

ప్రజాశక్తి- ఆళ్లగడ్డ: బలిజ సామాజిక వర్గానికి అండగా నిలబడే పార్టీలకే వచ్చే ఎన్నికల్లో మద్దతు తెలుపుతామని, బలిజలను విస్మరించే పార్టీలకు చరమ గీతం పాడుదామని శ్రీకృష్ణదేవరాయ కాపు బలిజ నిత్య అన్నదాన సత్రం అధ్యక్షులు శెట్టి విజయ్ కుమార్ అన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహెూబిలంలోనీ అన్నదాన సత్రంలో బలిజ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమములో సత్రం అధ్యక్షులు శెట్టి విజయ్ కుమార్, ముఖ్య అతిథిగా బలిజ పెద్దలు దాసరి రాము హాజరై నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో బలిజ కులస్తులు అత్యధికంగా ఉన్నార న్నారు. బలిజలకు వెన్నుదన్నుగా నిలబడే పార్టీకే ఓటు వేయాలని, డబ్బుకు అమ్ముడు పోరాదన్నారు. రాయలసీమతో పాటు నెల్లూరు జిల్లాలో బలిజ కమ్యూనిటీ ఎక్కువగా ఉన్నా ప్రధాన పార్టీలు ఎందుకు సీట్లు ఇవ్వలేదో రాజకీయ పార్టీల వారు చెప్పాలన్నారు. బలిజలందరూ ఒకే తాటిపై ఉండాలని, బలిజ సామాజిక వర్గానికి అండగా నిలబడే పార్టీలకే మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు సంజీవ రాయుడు, నల్లగట్ల బాలుడు, న్యాయవాది సుబ్బరామిరెడ్డి, సిద్ధి సత్యం, వీరయ్య, అంగం శివ రాయల్(జర్నలిస్ట్), ఉయ్యాలవాడ నరసింహులు, ఆకుల సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు

వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని టంగుటూరు పెద్దమ్మ నిత్య అన్నదాన సత్రానికి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు దాతలు రూ లక్ష రూపాయలు ఇచ్చినట్లు నిత్య అన్నదాన సంస్థ కార్యదర్శి రామ గంగిరెడ్డి తెలిపారు. ఆదివారం టంగుటూరు పెద్దమ్మ నిత్య అన్నదాన సత్రంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు నంద్యాల మండలం హైస్కూల్ కొట్టాల గ్రామానికి చెందిన ముక్కు చిన్న తిరుపతిరెడ్డి, ఆయన సతీమణి తిరుపతమ్మ, వీరి కుమారులు శేషిరెడ్డి, శేఖర్ రెడ్డి, శివారెడ్డి , వీరి కుటుంబసభ్యులు అన్నదాన సత్రంలో మినరల్ వాటర్ ప్లాంట్ కోసం లక్ష రూపాయలను విరాళంగా ఇచ్చినట్లు రామ గంగిరెడ్డి తెలిపారు.

సత్రానికి మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేసిన దాతలు

నేతల విగ్రహాలకు పడిన ముసుగులు

ప్రజాశక్తి - రుద్రవరం

నేతల విగ్రహాలకు ముసుగులు తొడిగిన అధికారులు

పార్లమెంటు శాసనసభ సాధారణ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయడంతో ఎన్నికల నగారా మోగింది. దీంతో రాజకీయ నాయకుల విగ్రహాలు చిత్రపటాలతో పాటు ప్రారంభపు దిమ్మెలకు ముసుగులు పడ్డాయి. ఎన్నికల నిబంధనల మేరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని ఆయా గ్రామాలలో రెవెన్యూ అధికారులు పంచాయతీ అధికారులు పోలీసులు రాజకీయ నాయకుల విగ్రహాలు చిత్రపటాలతో పాటు ప్రారంభపు దిమ్మెలకు ఆదివారము ముసుగులు తొడగారు. మండల కేంద్రమైన రుద్రవరంలో ఈవోపీఆర్డి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో విఆర్వోలు వెంకటరమణ నాగ నరసింహుడు పంచాయతీ కార్యదర్శి అరవింద నాయక్ పోలీసులు గ్రామ సేవకులు అలాగే చిన్నకంబలూరు కొండమాయ్యపల్లె గ్రామాలలో వీఆర్వో మల్లేశప్ప ఆధ్వర్యంలో గ్రామ సేవకులు రాజకీయ నాయకుల విగ్రహాలకు చిత్రపటాలకు ప్రారంభపు దిమ్మెలకు ముసుగులు వేశారు. గ్రామాలలోని పలు కాలనీలలో తిరిగి ఎక్కడ రాజకీయ నాయకుల విగ్రహాలు గాని చిత్రపటాలు గాని లేకుండా చర్యలు తీసుకున్నారు. అధికారులు ఎన్నికల కమిషన్ అదేశాల మేరకు ఎన్నికల నియమ నిబంధనల మేరకు విధుల్లో నిమగ్నమయ్యారు.

ఎన్నికల నియమావళి అమలు : ఎంపిడిఒ

బండి ఆత్మకూర్ : మండలంలో ఎన్నికల నిబంధన నియామవళిని పకడ్బందీగా అమలు చేయా లని ఎంపీడీవో విజయరావు తెలిపారు. వాణిజ్య సముదాయాలు కరెంటు ఫోల్లు ప్రభుత్వ కార్యాలయాలు ప్రధాన కూడళ్ల వద్ద ఉన్న రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను హోల్డింగ్లను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తొలగిస్తున్నామని చెప్పారు. మండలంలో అన్ని గ్రామాలలో ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలుపరిచేందుకు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఆదివారం నంద్యాల ఆత్మకూరు ప్రధాన రహదారిలోని మధు కూల్ డ్రింక్ షాప్ వద్ద ఉన్న ఫ్లెక్సీని తొలగించడం జరిగింది. అదేవిధంగా అన్ని గ్రామాల గ్రామపంచాయతీ అధికారులు రెవెన్యూ అధికారులు సమిష్టిగా ఎన్నికల నియమ నిబంధనని అమలు పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలను తొలగింపును పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయరావు

నేడు పదవ తరగతి పరీక్షలు

- ఏర్పాట్లన్నీ పూర్తి

నేడు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఇఒలు తెలిపారు. పరీక్షల కేంద్రాలను అధికారులు తనిఖీలు నిర్వహించారు.

ప్రజాశక్తి - విలేకరులు

పగిడ్యాల : పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంఈఓ లు

ఆత్మకూర్ : ఆత్మకూరు మండలంలో పదవ తరగతి పరీక్షలకు 1716 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు ఎంఈఓ జానకిరామ్ తెలిపారు. గతంలో ఏనాడూ లేని విధంగా 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 270 మంది, శ్రీ చైతన్య హై స్కూల్ నందు 246, పద్మావతి హైస్కూల్ నందు 207, జిల్లా పరిషత్ ఉర్దూ హైస్కూల్ నందు 226, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు 240, గౌతమ్ హైస్కూల్ నందు 227, డి పాల్ హైస్కూల్ నందు 300 మంది విద్యార్థులు ఈ కేంద్రాలలో పరీక్షలు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

పగిడ్యాల : మండలంలోని పరీక్ష కేంద్రాలను ఎంఈఓ సుభాన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ సుభాన్ మాట్లాడారు. మండలంలోని మూడు కేంద్రాలలో పదవ తరగతి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గతంలో మండల కేంద్రం పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాత్రమే పరీక్ష కేంద్రం ఉండేదన్నారు. ప్రస్తుతం మండల పరిధిలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాత ముచ్చుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మొత్తం ఈ పరీక్షలో 457 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. 168 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 162 మంది రెగ్యులర్ విద్యార్థులు, 59 మంది ప్రైవేటు విద్యార్థులు, ముచ్చుమర్రి జిల్లా పరిషత్ ఉన్నతర పాఠశాలలో 115 మంది రెగ్యులర్ విద్యార్థులు, 56 మంది ప్రైవేట్ విద్యార్థులు, డాక్టర్ బి.ఆర్ అంబే ద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 180 మంది రెగ్యులర్ విద్యార్థులు, 53 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించడం జరిగిందని తెలిపారు. పక్కబందిగా పరీక్షలు నిర్వహించడం జరుగుతుంద న్నారు. ఎంఈఓ 2 మురళీమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత ప్రయాణం

బనగానపల్లె రూరల్ : పదో తరగతి పరీక్ష కేంద్రాలకు హాజరు కావడానికి ఉచిత ప్రయాణం కల్పించినట్టు డిపో మేనేజర్ కే .రవి కిషోర్ తెలిపారు. విద్యార్థులకు హాల్ టికెట్ మీద ఉచిత ప్రయాణ సౌకర్యం ఉందని, విద్యార్థుల ఊరు నుండి పరీక్షా సెంటర్ వరకు అనుమతించబడును అని తెలిపారు.

రుద్రవరం : రుద్రవరంలోని జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాల, నరసాపురం గ్రామంలోని సెయింట్ థామస్ ప్రైవేటు పాఠశాలను విద్యాశాఖ ఉన్నతాధికారులు పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. రుద్రవరంలోని జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 280 మంది అలాగే నరసాపురం గ్రామంలోని సెయింట్ థామస్ ప్రైవేట్ పాఠశాల పరీక్ష కేంద్రంలో 240 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు మండల విద్యాశాఖ కోటయ్య తెలిపారు. పరీక్ష కేంద్రాలలో అన్ని సౌకర్యా లు కల్పించామన్నారు.

పని చేయని తాగునీటి ట్యాంక్

ఆళ్లగడ్డ: పదవ తరగతి పరీక్షలు ఈనెల 18 అనగా సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పట్టణంలోనీ ఆరు కేంద్రాలలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఎద్దుల పాపమ్మ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, ప్రజ్ఞ, ఏవిఆర్, సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాల, కేపిజి పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలలో 1548 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. అధికారులు మాత్రం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పినప్పటికీ కొన్ని కేంద్రాలలో అసౌకర్యాలు రాజ్యమేలుతు న్నాయి. బాలికల ఉన్నత పాఠశాలలో మూత్రశాలల కొరత ఉంది. వైపిపిఎం ఉన్నత పాఠశాలలో మూత్రశాలలకు తాళాలు వేసి ఉన్నారు. పక్కనే పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకు కుళాయిలు మూలకు చేరాయి.. అలాగే ప్రైవేట్ పాఠశాలల్లోనూ అసౌకర్యాలు నెలకొన్నాయి.

హంస వాహనంపై జ్వాలా నరసింహుడు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ: ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహెూబిలంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అహెూబిలం మఠం 46వ పీఠాధిపతి ఆధ్వర్యంలో జిపిప సంపత్, ఓఎస్డి శివప్రసాద్, కమ్యూనికేషన్ అధికారి సేతురామన్‌ల సమక్షంలో జరుగుతున్న బ్రహ్మోత్సవంలో భాగంగా ఆదివారం శ్రీ జ్వాలా నరసింహస్వామి హంస వాహనంపై కొలువుదిరి ఆలయ మాడవీధుల గుండా విహరించారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులు జ్వాల నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు అర్చకులు పంచామృతాభిషేకంనిర్వహించారు. రాత్రి జ్వాలా నరసింహస్వామి సూర్యప్రభ వాహనంపై కొలువుదిరి భక్తులకు దర్శనం ఇచ్చారు.

దిగువ అహెూబిలంలో.. దిగువ అహెూబిలంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు వేణు గోపాలాచార్యులు సాంప్రదాయం ప్రకారం ఉత్సవ మూర్తులు శ్రీ ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి , భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం స్వామి అమ్మవార్లను కొలువు మండపంలో ఉంచి ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్వజపటాన్ని బంగారు ధ్వజస్తంభానికి వేద మంత్రాల మధ్య ఆవిష్కరించారు. ఈ ధ్వజారోహణ కార్యక్రమంలో అహెూ బిలం 46వ పీఠాధిపతి స్వామి పాల్గొన్నారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, సాయంత్రం భేరి పూజ నిర్వహించారు. ఉత్సవమూర్తుల ఎదుట భేరి తాటను వాయించి సకల దేవతలను ఆహ్వానించారు. భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రా నికి తరలివచ్చి క్యూ లైన్ లో వేచి ఉండి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి సింహ వాహనంపై శ్రీ ప్రహ్లాద వరద స్వామి కొలువుదీరారు. పూజలు నిర్వహించిననంతరం ఆలయం మాడవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.

పునరుద్ధరణ చేయబడిన సువర్ణ కవచములు సమర్పణ: అహెూబిల మఠం 46వ పీఠాధిపతి వారు ఆదివారం పునరుద్ధరణ చేయబడిన స్వర్ణ కవచములను శ్రీ ప్రహ్లాదవరద స్వామి వారికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు సమర్పించారు. పాత కవచములకు చేయవలిసిన మరమ్మతులను చేసి నూతనంగా ప్రతిష్ఠించి స్వామి వారికి సమర్పించారు. అలాగే అమతవల్లి అమ్మవారికి నూతన స్వర్ణ కవచముల పనులను పర్యవేక్షించారు.

మహారాజ శ్రీ ప్రిన్సిపల్ జూనియర్
సివిల్ జడ్జి కోర్టు :: నంద్యాల
O.S. No. 607/2022

ముసల్ రెడ్డి గారి రితిష్ రెడ్డీ .... వాది
వర్సెస్
బత్తులూరి బాల నాగన్నతండ్రి నాగేశ్వరరావు వయసు 32 సంవత్సరములు చాగోలు గ్రామం నంద్యాల మండలం నంద్యాల జిల్లా. .... ప్రతివాది

ప్రతివాది కి దావా సమన్లు

పై కోర్టులో పై నెంబర్ దావాలో వాది దగ్గర ప్రతివాది 9-11-2021వ తేదీ న రు. 2,00,000/- మరియు అదే రోజు 2,50,000/- రూపాయలు తీసుకొని బాకీ పడి రాసి ఇచ్చిన రెండు ప్రామిసరీ నోట్ల బాకీ మొత్తం 3,06,826/- రూపాయలు రాగోరి దాఖలు చేసి దావాలో ప్రతివాది అయిన మీరు కోర్టు వారి ఉత్తర్వుల మేరకు తేదీ. 26-3-2023 న ఉదయం. 10.30 గంటలకు మీరు గానీ మీ తరఫు వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. మీరు హాజరుకాని పక్షంలో మీ పరోక్షంగా తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేదీ 26-3-2024

ఇట్లు
S. రామ తులసిరెడ్డి
వాది పరం అడ్వకేట్
నంద్యాల. 8897678989

మహారాజశ్రీ ఆళ్లగడ్డ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E. P. No.41/2022 In O.S.No.190/2016

ఇంజేటి వెంకట రాజేశ్వరి. ...D.Hr
V/S
కరవాడి మాధవరెడ్డి,
S/o.నరసింహారెడ్డి,
వయస్సు 39 సం॥,
వ్యాపారం, H. No.8-12-49,
విద్యానగర్, శ్రీనివాస నగర్,
ఆళ్లగడ్డ టౌన్ & మండలం,
నంద్యాల జిల్లా. ...J. Dr

వేలం నోటీసు కొరకు
(Order 21 Rule 66, 68 of Cpc)

పై EP నెంబర్ లో పై కోర్టులో EP దాఖలు చేసే పలుమార్లు నీకు వేలం నోటీసులో పంపినప్పటికీ నీకు ముట్టనందున పై EP లో నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్నయెడల నీవు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని 19-03-2024 వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవచ్చును. లేని యెడల పై EP ని విచారించి మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 19-03-2024

S. చంద్రశేఖర్ రెడ్డి,
C.G. **ఓబులేసు,**
అడ్వకేట్స్,
కోవెలకుంట్ల.
Cell No. 9885224734